కాంగ్రెసోళ్లకు స్వప్రయోజనాలే ముఖ్యం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 27: కాంగ్రెస్ నాయకులకు రైతుల శ్రేయస్సు కంటే స్వప్రయోజనాలే ముఖ్యమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.13 కోట్లతో చేపట్టిన నల్లపోచమ్మతల్లి ఎత్తిపోతల పథకం నిధులు పక్కదారి పట్టించిన కారణంగా పథకం కింద ఒక్క ఎకరాకు సైతం సాగునీరందలేదన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో ఇదే ప్రాజెక్టుకు రూ.4.20 కోట్లు మంజూరు చేశారన్నారు. అయితే ఈ ప్రాజెక్టు వ్యయాన్ని మరో కోటికి పెంచాలని కాంగ్రెస్ నాయకులు కోరడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ పథకం పునరుద్ధరణ పేరిట నిధులు కాజేసేందుకు కుట్ర జరుగుతున్నదన్నారు. రైతుల మేలు కోరి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులను కొనసాగించే దిశగా స్థానిక ఎంపీ సురేశ్ శెట్కార్, ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డిలు చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఎంఏ నజీబ్, పరశురాం, ముజామ్మిల్, విఠల్‌రావు, మల్‌గొండ, సలీమ్, విఠల్, విజయ్‌లు ఉన్నారు.

బొంతపల్లిలో అధికారుల స్పెషల్ డ్రైవ్

గుమ్మడిదల, జూన్ 27 : పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వారు మత్తు పదార్థాలకు బానిసలై గ్రామంలో రాత్రి వేళలో రోడ్లపై తిరుగుతున్నారని గ్రామస్తులు ఆరోపించడంతో పంచాయతీ ప్రత్యేక అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం మండలంలోని బొంతపల్లిలో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఉమాదేవి, ఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో వీధుల్లో ఇంటింటికీ తిరిగారు. ఇండ్లల్లో అద్దెకుంటున్న వారి ఆధార్‌కార్డు, పూర్తి వివరాలు తీసుకుని పంచాయతీ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. అద్దెకుంటున్న వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పూర్తి బాధ్యత ఇంటి యజమానులదే అని స్పష్టం చేశారు. గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. వారి వెంట ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సద్దివిజయభాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న జోగిపేట సీఐ

క్షతగ్రాతులను అంబులెన్సులో ఎక్కిస్తున్న జోగిపేట సీఐ అనిల్‌కుమార్

చౌటకూర్, జూన్ 27: మండల పరిధిలోని శివంపేట శివారులో మూలమలుపు వద్ద గురువారం సంగారెడ్డి-నాందేడ్ రహదారిపై ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జీడిమెట్లకు చెందిన ఇద్దరు వ్యక్తులతో పాటు మండలంలోని వెండికోలుకు చెందిన బీరు పరిశ్రమ కాంట్రాక్టు కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో సంగారెడ్డి వైపునకు వెళ్తున జోగిపేట సీఐ అనిల్‌కుమార్ వారి వివరాలు తెలుసుకుని ఎన్ఏహెచ్ఐకు చెందిన అంబులెన్సులో స్వయంగా సీఐ అనిల్‌కుమార్ క్షతగాత్రులను ఎక్కించి సంగారెడ్డి దవాఖానకు తరలించి మానవత్వం చాటుకున్నారు.

కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయాలి

రామచంద్రాపురం, జూన్ 27 : భారతీనగర్ డివిజన్ బొంబాయికాలనీలో నిర్మాణ దశలో నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్‌ని కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని ఆమె ఏఈ చంద్రశేఖర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సర్కిల్ యూత్ అధ్యక్షుడు నర్సింహా, నాయకులు గౌస్, కృష్ణగౌడ్, కుత్బుద్దీన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు ప్రమోషన్

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 27 : జిల్లాలో లోకల్ బాడీ యాజమాన్యం కింద ఎస్జీటీ, తత్సమాన ఉపాధ్యాయ కేటగిరీల ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్స్‌గా ప్రమోషన్ కల్పించినట్టు డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు మాధ్యమంలో పీఎస్‌హెచ్‌లుగా 105 మంది, ఉర్దూ మాధ్యమంలో పీఎస్‌హెచ్‌లుగా ఇద్దరూ, స్కూల్ అసిస్టెంట్స్‌కు సంబంధించి తెలుగు గణితంలో 31 మంది, ఉర్దూలో ఒకరు, ఫిజిక్స్ తెలుగులో 12 మంది, ఉర్దూలో ఇద్దరు, బయోలజీ తెలుగులో 50 మంది, ఉర్దూలో ఇద్దరు, సోషల్ తెలుగులో 75 మంది, ఉర్దూలో నలుగురు, కన్నడలో ఒకరు, తెలుగు భాషలో 200 మంది, హిందీ భాషలో 166 మంది, ఆంగ్లంలో 8 మంది, ఉర్దూలో నలుగురు, పీడీలుగా 69 మంది, స్పెషల్ ఎడ్యుకేషన్ తెలుగులో ఏడుగురు, మొత్తం 739 మందికి ప్రమోషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

బొల్లారం, జూన్ 27: మున్సిపాలిటీ పరిధిలోని వైయస్సార్ కాలనీలో నూతనంగా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డును నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ వేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మీ నాయుడు, స్థానికులు నబి, ధర్మ, కాలనీవాసులు పాల్గొన్నారు.

'ట్రిపుల్ ఆర్'పై అధికారుల సర్వే

హత్నూర, జూన్ 27 : మండల పరిధిలోని దేవులపల్లి శివారులో గురువారం రెవెన్యూ అధికారులు ట్రిపుల్‌ఆర్ సర్వే నిర్వహించారు. ప్రభుత్వం త్రిబుల్‌ఆర్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటుండటంతో గ్రామశివారులో భూములు కోల్పోతున్న రైతుల సమక్షంలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసినట్లు రైతులు తెలిపారు. గతంలో సర్వే జరిపిన అధికారులు మరోమారు రైతుల సమక్షంలో సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాస్, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిలో హరినామ సంకీర్తన

హత్నూర, జూన్ 27: మండల పరిధిలోని చింతల్‌చెరు గ్రామ హనుమాన్ భజనమండలి భక్తులు గురువారం తిరుపతిలో అఖండ హరినామ సంకీర్తనలు ఆలపించారు. తిరుపతికి వెళ్లినవారిలో దుర్గేశ్, రాజేందర్, కుమార్, సదానందం, అనిల్, ఈశ్వరయ్య, తదితరులు ఉన్నారు.

అక్రమ లేఔట్లపై దృష్టి సారించాలి

- పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి
- ఎమ్మెల్యే చింతాప్రభాకర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, జూన్ 27 : అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ లేఔట్లు కోకొల్లలుగా వెలుస్తున్నాయని, వీటిని ఉపేక్షించొద్దని ఎంపీడీవోలకు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అభివృద్ధి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలం ఆరంభం కావడంతో తాగునీటి సరఫరాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి అక్కడి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆర్టీసీ బస్సులు తిరగని గ్రామాలను గుర్తించి విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా వారి సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పనులను వేగవంతంగా పూర్తి చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు యాదగిరిరెడ్డి, జ్యోతిలక్ష్మి, లక్ష్మి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 27: టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీబీ నివారణ అధికారి డాక్టర్ రాజేశ్వరి పేర్కొన్నారు. గురువారం స్థానిక బైపాస్ రోడ్డులోని ఓ హోటల్‌లో టీబీ నివారణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాను టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవి మాట్లాడుతూ జిల్లాలో టీబీ నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితా కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా ప్రజలకు టీబీపై అవగాహన కల్పించి టీబీ నివారణకు కృషి చేస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లో టీబీ నివారణ కోసం చేపడుతున్న చర్యలను మెప్మా పీడీ గీత వివరించారు. సమావేశంలో టీబీ అలర్ట్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పురుషోత్తం, ఎలీషా బాబు, జిల్లా క్షేత్రస్థాయి అధికారి కృష్ణకాంత్ పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్ల పరిశీలన

కోహీర్, జూన్ 27: మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను గురువారం ఆర్ఐ సత్యనారాయణ పరిశీలించారు. దిగ్వాల్ గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 88డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి 74ఇండ్లను అర్హులకు కేటాయించారు. మిగతా వాటికి కూడా అర్హులను గుర్తించి త్వరలో అందించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

హోంగార్డు కొడుకుని అభినందించిన ఎస్పీ

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబర్చిన రఘువంశిని అభినందిస్తున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, జూన్ 27: పూణెలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్ టోర్నమెంటులో మొదటి బహుమతి పొంది చాంపియన్‌గా నిలిచిన హోంగార్డు కుమారుడు రఘువంశీని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అభినందించారు. గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో రఘువంశీని అభినందించి భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని కోరారు. గత నెలలో పూణెలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్ టోర్నమెంటులో 27 రాష్ట్రాలకు చెందిన బాక్సర్లు పోటీ పడగా ఉత్తమ ప్రతిభతో రఘువంశీ చాంపియన్‌గా నిలిచారని ఎస్పీ తెలిపారు. రఘువంశీ తండ్రి ముత్యం(హోంగార్డు)గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తండ్రి ముత్యం, కోచ్ మాస్టర్ పోచయ్యలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

మాట్లాడుతున్న గడ్డపోతారం మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశ్‌చారి

జిన్నారం, జూన్ 27: పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గడ్డపోతారం మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశ్‌చారి అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గండిమైసమ్మ వివేకానంద హైస్కూల్ విద్యార్థులతో కలిసి కిష్టయ్యపల్లిలోని గంధం పార్కులో ఆయన మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ రక్షణకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈవో వెంకట్, పాఠశాల కరస్పాండెంట్ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూబాధితులకు పరిహారం చెల్లించాలి

మాట్లాడుతున్న ఆర్డీవో పాండు

అందోల్, జూన్ 27 : రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న తమకు న్యాయమైన పరిహారం చెల్లించాలని చౌటకూర్ మండల రైతులు కోరారు. గురువారం అందోల్-జోగిపేట ఆర్డీవో కార్యాలయం ఆవరణలో భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో ఆర్డీవో పాండు అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇవ్వడంతో పాటు జీవనోపాధి చూపాలన్నారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన

భేటీ బచావో-భేటీ పడావో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహిళా సంక్షేమ శాఖ అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 27: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు చదువు, ఉద్యోగం, ఆర్థిక అభివృద్ధి, చట్టాలు, మానసిక ఒత్తిడిలను అధిగమించే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో పట్టణ మహిళా ఎస్సై నాగలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, మహిళా సాధికారత కేంద్రం సమన్వయ కర్త పల్లవి, అధ్యాపకులు, 750 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే క్రిమినల్ కేసులు

నారాయణఖేడ్, జూన్ 27: గంజాయి సాగు చేసినా, అక్రమంగా రవాణా చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. గురువారం నారాయణఖేడ్ డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ సబ్‌డివిజన్ పరిధిలోని కేసుల వివరాలను ఆరా తీసి కేసులను పరిశోధించే విషయమై పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నారాయణఖేడ్, కంగ్టి సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ రమేశ్, సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్సైలు పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

ఎమ్మార్సీ ఎదుట మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, జూన్ 27: నియోజకవర్గంలో విద్య వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం కల్హేర్ మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గుర్రపు సుశీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని శాఖల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. అంతకు ముందు ఎమ్మార్సీ కార్యాలయం ముందు మొక్కలు నాటారు. జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియనుండడంతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు అలీ, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో శంకర్, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ సభ్యుడు ఘని పాల్గొన్నారు.

గాడితప్పిన ప్రత్యేక పాలన

- ఇష్టానుసారంగా చెత్త పారబోత
- రోడ్డు పక్కన, వాగుల్లో డంపింగ్
- చెత్తకు నిప్పు పెట్టి తగులబెడుతున్న సిబ్బంది
- సమస్యను పరిష్కరించాలని కోరుతున్న స్థానికులు

బద్దిపూర్ అడవిలో పల్లెప్రగతి ట్రాక్టర్‌తో చెత్తను డంప్ చేస్తున్న దృశ్యం

ఝరాసంగం, జూన్ 27 : ఒకప్పుడు పల్లెలు అంటేనే పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణానికి నెలవు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది. కాలనీల్లో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థపు దార్థాలతో పాటు, తడి, పొడి చెత్తను జీర్ణపల్లిలోని చెత్తను వాగులో, ఝరాసంగం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం పక్కన, రోడ్డు పక్కన, బద్దిపూర్‌లోని చెత్తను అడవిలో డంపు చేస్తున్నారు. మూగజీవాలు ఆ చెత్తను తింటున్నాయి. ఎక్కువ చెత్త కాగానే నిప్పు పెట్టి తగలబెడుతున్నారు. అటు వైపు వెళ్లే వాహనదారులు, చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న రైతులు, ప్రజలు దుర్వాసన భరించలేక అనారోగ్యానికి గురవుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డంప్ యార్డులను నిర్మించారు. మండల కేంద్రంలో కొన్ని గ్రామాలకు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా గుర్తింపు రావడానికి ఈ డంపుయార్డులే కారణం. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను రీసైకిల్ చేసిన వ్యర్థాలను మట్టిలో కలిపి సేంద్రియ ఎరువులుగా మార్చి వాన పాములను వదిలిన ఎరువులను నర్సరీల్లోని మొక్కలకు వేసే వారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా డంపింగ్‌యార్డు

డంపింగ్ యార్డులోనే వేసేలా చర్యలు

గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వాగులు, రోడ్డుపక్కన, ఆడవిలో డంపు చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్న కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డులను వినియోగించేలా, సేకరించిన తడి, పొడి చెత్తను రీసైకిల్ చేసిన వ్యర్థాలను మట్టిలో కలిపి సేంద్రియ ఎరువులుగా మార్చి వాన పాములను వదిలిన ఎరువులను నర్సరీల్లో వాడి మొక్కలు పెంచేలా చర్యలు తీసుకుంటాం.

- సుధాకర్, ఎంపీడీవో, ఝరాసంగం

జిన్నారంలో కుళ్లిన చికెన్ అమ్మకం

జిన్నారం, జూన్ 27 : జిన్నారంలోని ఓ చికెన్ దుకాణంలో మృతి చెందిన కోడిని కోయడంతో పురుగులు వచ్చాయి. గుర్తించిన బాధితుడు విజయ్ దుకాణ యజమానిపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్, గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశాడు. పంచాయతీ కార్యదర్శి ఆదేశాలతో సిబ్బంది అక్కడికి వచ్చి కుళ్లిన చికెన్‌ను పరిశీలించి ఫొటోలు తీసుకున్నారు. కొంతకాలంగా మృతి చెందిన కోళ్లను కోస్తున్నట్లు పలువురు తెలిపారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ

విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొల్లారం, జూన్ 27: జాతీయస్థాయి పోటీల్లో బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గుజరాత్ రాష్ట్రంలోని భావనగర్‌కు చెందిన రెయిన్బో ఆర్ట్ సెంటర్ జాతీయ స్థాయిలో నిర్వహించిన కలరింగ్, చేతిరాత పోటీల్లో పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించినట్లు హెచ్ఎం మంగీలాల్, గైడ్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రతిభారాణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యపూజలకు నోచుకోని రామాలయం

గుమ్మడిదల, జూన్ 27 : మండల కేంద్రంలోని కల్యాణ రామచంద్రస్వామి ఆలయంలో 45 రోజులుగా నిత్య పూజలు జరగడం లేదని కార్యనిర్వాహక, వంశపారంపర్య ధర్మకర్త కందాడై విజయరామన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ భద్రత నిమిత్తం మే 13న సీలు వేశారని, దీనిపై దేవాదాయ శాఖ అధికారులకు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా నిత్యపూజలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జేపీఎస్ టూ పేటెంట్ అధికారి

- 6 ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన గిరిజన బిడ్డ
- యువకులకు ఆదర్శం బోర్గికి చెందిన రామేశ్వర్

తల్లిదండ్రులతో రాథోడ్ రామేశ్వర్

కంగ్టి, జూన్ 27 : ఓ గిరిజన యువకుడు ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు పొంది యువకులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండల పరిధిలోని బోర్గి గ్రామానికి చెందిన పుల్‌సింగ్, సుమన్‌బాయి దంపతుల కుమారుడు రామేశ్వర్ ఐదో తరగతి వరకు నారాయణఖేడ్‌లోని ఆశ్రమపాఠశాలలో, 6 నుంచి 10 వరకు నల్లవాగు గురుకుల పాఠశాలలో చదివాడు. ఇంటర్ నర్సాపూర్ గురుకులంలో, బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బయోమెడికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఆపై హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేశాడు. అంతలోనే జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కోసం నోటిఫికేషన్ రాగా అందులో ఉత్తీర్ణత చెంది 10 నెలల పాటు సిర్గాపూర్ మండలం వంగ్ధాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. పోలీస్‌కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో ఏఆర్ కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయ్యాడు. అనంతరం పాలిటెక్నిక్ లెక్చరర్, ఐఐటీలో లెక్చరర్, గ్రూప్ 4లో సైతం ఉద్యోగాలను సంపాదించాడు. ఐఐటీ కందిలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీస్ వారి ఆధ్వర్యంలో ఇటీవల ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన పరీక్షలో 380 ర్యాంకు సాధించి బయోమెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పేటెంట్ అధికారి(గ్రూప్ వన్ స్థాయి)గా అర్హత సాధించాడు. దేశంలో కేవలం ముంబయి, కోల్‌కత్తా, ఢిల్లీ, చెన్నై లో మాత్రమే వీటిని భర్తీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే పేటెంట్ అధికారిగా జాయిన్ అవుతానని వెల్లడించారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కోహీర్: మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

కోహీర్, జూన్ 27 : కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. గురువారం జహీరాబాద్ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలోని మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెలా రూ.26వేలు చెల్లించాలని కోరారు. వారిని వెంటనే పర్మినెంటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కామయ్య, యశోదమ్మ, మోహన్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

సదాశివపేట, జూన్ 27 : మున్సిపల్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు అంజయ్య, రవి, బాల్‌రాజ్, శ్రీనివాస్, నర్సింహులు, రాజు, దుర్గా ప్రసాద్, లక్ష్మి, మొగులయ్య, రుక్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

సంగారెడ్డి, జూన్ 27 : మున్సిపల్ కార్మికులకు 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో విధులు బహిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజు, సుగుణమ్మ, నరసమ్మ, సంగీత, శశికళ, వేణు యాదగిరి, రాజు, సంగమేశ్వర్, లక్ష్మీనారాయణ, నర్సింహులు, యాదయ్య, రాజేశ్వర్, నాగరాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి మహాప్రభో

గుంజోట్టి- వడ్డి గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు

న్యాల్‌కల్, జూన్ 27 : మా రోడ్డును బాగు చేయండి మహాప్రభో అంటూ.. గుంజోట్టి- వడ్డి గ్రామాల ప్రజలు, వాహనచోదకులు వేడుకుంటున్నారు. మండల పరిధిలోని ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమం సమీపం గుండా రాంతీర్థం, గుంజోట్టి, వడ్డి, శంశోల్లాపూర్ గ్రామాల మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు రోడ్డుపై పలు చోట్ల గుంతలు పడ్డాయి.